"నాటకం"

"ఏమి చేస్తున్నా వన్నయ్యా ?"

"ఇదిగో, యిదోయి తమ్ముడూ"

"నోటితో చెప్పగూడదూ ?"

"కళ్లతో చూడగూడదూ ?"

"......అయితే, చూడకుండానే అడిగా నంటావా ?"

"......కాకపోతే, చూసినవాళ్లకీ చెప్పా లంటావా ?"

చుట్లానికి వల్లమాలిన కోపం వచ్చింది.

అది అసంతృప్తిగా పరిణమించింది.

ఆపరిణామం అబ్బురపాటుగా మారింది.

అది నిర్విణ్ణత అయింది.

చివరికి విసుపు అయి అది ధుమధుమ లాడించింది.

"ఛా" అనుకున్నాడు.

అనుకుంటూనే, విశ్వనాథాని కెదురుగా స్తంభాని కానుకుని చతికిల బడ్డాడు.

చతికిలబడి, అతను పలకరిస్తేనే పలుకుదా మనుకుని మూతి బిడాయించుకున్నాడు; కాని వూరుకోలేకపోయాడు.

తన రాక వంటగదిలో తెలవాలి మరి.

"నాటకం చూడవూ ?" అని డొంక కదిపాడు, మెల్లిగా.

"ఏమిస్తారు చూస్తే ?" అనడిగాడు విశ్వనాథం.

"భేష్"

"............"

"రాఘవాచార్లోయ్ వచ్చిన సటుడు"

"............"

"చూడా లంటే మళ్లీ యింతట్లో దొరుకుతాడా ?"

"టిక్కెట్టుకోసం ఖర్చయిన డబ్బు యెంతట్లో నయినా మళ్లీ మనచేతికి వస్తుందా ?"

"నీ కెంతసేపూ డబ్బురంధి తప్ప మరేమీ లేదు"

"మరి, రాఘవాచారి యెందుకు వచ్చా డంటావ్ ?"

"ఒక పేదవిద్యార్థికి సాయంచెయ్యడానికి"

"చాలా గొప్ప సంగతి. అయితే, యింటి దగ్గిరనుంచే తెచ్చాడా డబ్బు?"

"వా ! కోట్ల విలవయిన ప్రశ్న వేశా వన్నయ్యా"

విశ్వనాథం బదులుచెప్పలేదు.

వంటింటో అలికిడి లేదు.

వాకట్లో గాలీ లేదు.

ఉడికిపోసాగాడు.

ఇంతలో గదితలుపు తెరుచుకుంది.

లేతాకుపచ్చ దీపపు కాంతి చూపు లాకర్షించింది.

ఒకచేత తాంబూలపు పళ్లెం పట్టుకుని ద్వారానికి కొంచెం యెడంగా నుంచుని వుంది కామేశ్వరి.

"ఎవరుచెప్మా ?" అని చూస్తూనే "వెళ్లడమా మానడమా" అనుకుంటూనే యివతలికి వచ్చిం దామె.

గదిలో వుండగా వొక సొగసూ, వాకట్లోకి వచ్చాక వొక సొగసూ కులికిం దామె మొగం.

తెల్లపువ్వుల తోపుచీర కట్టుకునీ, చిన్నిచుక్కల తెల్లజాకట్టు తొడుక్కునీ వుం దామె.

కామేశ్వరి అంత చక్కని దని అత నెప్పుడూ అనుకోలేదు. చకితు డయిపోయాడు.

"ఇదిగో, యెక్కణ్ణుంచి మరిదీ ?" అ ని ఆమే పలకరించింది, సాదరంగా.

"ఇంటిదగ్గిరనుంచే నమ్మా"

"కాళ్లు కడుక్కుందువు గాని, నీళ్లు తెస్తున్నా"

"కొళాయి దగ్గిరే కాళ్లు కడుక్కువచ్చాను. నువ్వు శ్రమపడ నక్కరలేకుండా, మునిసిపాలిటీవాళ్లు మీాయింటి యెదటే వేశారు కుళాయి."

ఒక్కమాటు పుస్తకం మీాది చూపు లిటు మళ్లించి "ఇంకేమిా లేవుట్రా అలాంటి యేర్పాట్లూ ?" అనడిగాడు విశ్వనాథం, పరీక్షగా చూస్తూ.

"మెరుపుదీపం కూడా మీా గుమ్మంలోనే పడింది ; మొలిచి నట్టు"

"ఇంకా ?"

చూశాడు; గాని చుట్టాని కేమిా కనపడలేదు.

అయినా, విశ్వనాథం చూపు లింకా అలాగే వున్నాయి, నిలవతీస్తున్నట్టు.

అది గుర్తించి "భోజనం——" అని అర్ధోక్తిలోనే వూరుకుంది కామేశ్వరి.

"అప్పుడేటమ్మా ?" అంటూ అవ్యవధానంగా యెదు రడిగాడు చుట్టం, అమ్మయ్యా అనుకుని.

"ఇదే రావడమా ?"

"రావడం అయిదుగంటల బండిలోనే వచ్చాను; కాని ఆలస్యం అయినా మీ యింట్లో లోటు లేదుగదా అని—"

"అప్పుడనగా వచ్చి యెనిమిదిన్నర దాకా యే పెద్దగుర్రానికి పళ్ళుతోముతున్నావూ మరీ ?"

"రెయిల్లో మనిషిమీద మనిషిగా కూచున్నాం. నా శరీరం అరిటిగెల కావేసినట్టయిపోయింది. అంచేత, కాస్త గాలి మేస్తేగాని వుండలేక, యిప్పటిదాకా గోదావరి గట్టున కూచుని, పనిలో పని వొక్క బుడగ కూడా వేసేసి—"

"మీ అన్నయ్యదగ్గిర కూచో నిమిషంలో వంట చేసేస్తాను, ష్టవ్వుమీద"

"అప్పుడే మీ భోజనా లయిపోయాయా ?"

"ఇవాళ కొత్తా, నువ్వెరగనిదా ?"

"పాపం—మళ్ళీ నా కోసం—"

"పాపాలకు పోక, కుర్చీ అలా ముందువాలోకి లాక్కుని కూచో ?"

"ఇదిగో, చూడూ, ఎలాగా శ్రమపడుతున్నావు కనక, కాస్త తొరగా—"

"ఏమిటా వుపద్రవం ?"

"నాటకం చూడ్డానికి వచ్చానమ్మా ! ఎనిమిదిన్నర దాటడం నీకే తెలుసుగా ?"

విశ్వనాథం చురుగ్గా చూశాడు.

"మరి మా చెల్లాయిని తీసుకువచ్చావు కాదేం ?" అనడిగింది కామేశ్వరి, శ్రీవాభింగాభిరామంగా చూస్తూ.

చుట్టానికి కులాసా పొంగుకుంటూ వచ్చింది.

"పెళ్లికి వెడుతూ పిల్లిని—" అంటూ మాట నాన్చేశాడు, తన సద్యస్ఫూర్తి అంతా మొగం మీాది తెచ్చుకుని.

"అవునులే, కుక్కకి పిల్లెందుకూ?" అనడిగేసింది కామేశ్వరి, అవ్యవధానంగా.

ఎగిసిపడిచూశాడు విశ్వనాథం.

తాంబూలపుపళ్లెం గదిలో వుంచివచ్చి, వంటింటి తాళం తీసింది కామేశ్వరి, భర్తకేసి నీరసంగా చూస్తూ.

౨

విశ్వనాథానికి వొళ్లు రవులుకుపోయింది.

అసలు, రాజమహేంద్రవరం బదిలీ అయినప్పణ్ణుంచీ చుట్టాలంటే రోత పుట్టిం దతనికి.

అన్ని విధాల అనాదరం కనపరిచినా కణాయించుకునే కూచున్న ఆచుట్టం అంటే డోకే వచ్చేటట్టయింది.

మధ్యాహ్నానికి మధ్యాహ్నమూ ఇలాంటిదే తటస్థించింది.

నాటితో, ఆధునికాంధ్రకవిపండితసభ ఆఖరు.

ఇవాళ, అతనికి నచ్చిన రాతగాళ్లు తమ కొత్తరచనలు చదువుతారు, స్వయంగా.

అంచేత, నాలుగింటికే బయలుదేరారు భార్యాభర్తలు.

బండికూడా ఎక్కారు.

బండిమనిషి కళ్లెం లాగి కొరడా వూపుతూ "తప్పుకోండి బాబయ్యా" అన్నాడు.

"ఆపు బండి" అన్నా రెవరో.

విశ్వనాథం వులిక్కిపడి చూశాడు.

నెత్తిమీద మూట, వొంటినిండా చెమటవోడికలు, ముఖాన శూన్యం, చేతిలో కగ్గిన రాగిచెంబు — వేదమూర్తి సాక్షాత్కరించాడు, అప్పుడే సోమకాసురుని పట్టుతప్పించుకుని వస్తున్నట్టు.

“మా మామయ్య” అంది కామేశ్వరి, చకిత అయి.

విశ్వనాథం మాట్లాడలేకపోయాడు.

“ఎక్కణ్ణుంచి మామయ్యా ?” అని కామేశ్వరే పలకరించింది, మొగుడు తప్పుకుంటే దిగుదామని చూస్తూ.

“తిరుపతినుంచి వస్తున్నాను. రాత్రి కూడా భోజనం లేదు” అన్నాడు మేనమామ, నాలుకతో పెదవులు తడుపుకుంటూ.

విశ్వనాథం కొయ్యాయిపోయాడు.

అతను కదల్లేకపోడం చూసి, అతన్ని రాసుకుంటూనే దిగుతూ, చెవిలో నోరుపెట్టి “మీరు వెళ్లండి” అని చెప్పి, బండి దిగింది కామేశ్వరి.

ఇదంతా నెమరుకి వచ్చింది విశ్వనాథానికి.

అతని మొగం జేవురించింది.

అంతే.

ఏతావతా:

కామేశ్వరి చాలా చురుకైన మనిషే.

చెయ్యవలసిన పని నిమిషాలమీదే చేసేస్తూ వుంటుంది.

అయినా, తన తరవాత ఆమె భోజనం చేస్తే కొంచెమయినా ఆలస్యం కాకమానదని ఆమెని తనబంతినే కూచోబెట్టుకున్నాడత నీపూట.

ఒకటి రెండుసార్లు నెయ్యి కూడా గసే నడ్డించాడు.

అయినా, స్థలశుద్ధి చేసి వంటిల్లు విడిచిపెట్టడాని కామెకి తన అంచనా కంటే మరో రెండు నిమిషా లెక్కువసేపే పట్టింది.

ఎలా గయినా ఈ ఆలస్యం కూడదీసుకోవా లని, తర వాత, ఆమె చాలా చురుగ్గానే పని చేసింది.

అతివేగంగా చీర సింగారించుకుంది.

జడలో మల్లెదండ సర్దుకుంది.

మొగానికి మంచుమిరాగడా, బట్టలకు సెంటూ రాసుకుంది.

అతని కండువాకీ, చొక్కాకీ కూడా రాసింది.

తాంబూలాలు పళ్లెం చేతపుచ్చుకుని భామవేషం లాగ బయలు దేరింది.

కాని తలుపు తీశాటప్పటికి ఈకందారాజు ప్రత్యక్షం

ఇంత జరిగినా, పైకేమీ అనకుండా—మాటే ఆడకుండా —అక్కసంతా మనసులోనే జీర్ణం చేసుకుంటూ రామదాసు నాటకం చూసుకోసాగాడు విశ్వనాథం.

అయిదు నిమిషా లయింది.

వంటింట స్టవ్వ అల్లరి ప్రారంభం అయింది.

ఒక్కమాటు చర్రుమంది విశ్వనాథానికి; కాని చట్టానికి మనసు కుదుటబడింది.

ఇంకేం, నోరు విడింది.

మనసులో చింతన చేసుకోడాని కేమీ లేనప్పుడు జరిగే దంతే గా ?

"విశేషా లేమి టన్నయ్యా ?"

"వరసపెట్టి నా పని కూడా పాడుచెయ్యాలా తమ్ముడూ ?"

"ఇవాళ, మహా చిరాగ్గా వున్నా వేమిటోయ్ ?"

"అది కలిగిస్తున్నది నువ్వు"

"క్షమించు"

మొగం పక్కకి తిప్పుకున్నాడు చుట్టం.

వీధిలో, ముందు పెద్దపెద్ద దీపాలూ, వెనక గాఢాంధకారముగా యేదో కారు పరుగెత్తింది, భొంయి మంటూ.

చుట్టానికి వ్రాహా కెల్లించింది.

"ఇది వొక్కటీ చెప్పు, మరి నీజోలికి రాను. నాటకం మునిసీ మునియగానే వెడదా మంటే యే దయినా జన్ను——"

"మళ్లీ మొదలా ?"

ఇది కొంచెం గదిమిన ట్టుండగా చుట్టం తెల్లపోయాడు; కాని ఉత్తరక్షణంలో అభిమానం ముంచుకువచ్చింది.

"ఏదో ద్వంద్వార్థంగా వుంటున్నాయి నీమాట" అన్నాడు వెంటనే, కనుబొమలు ముడుచుకుని.

"నీ గ్రహణశక్తి కలా అనిపిస్తోంది"

"వలిపిచంపక, వున్న దేదో కాస్త విప్పి చెబుదూ"

విశ్వనాథం మాట్లాడలేదు.

చుట్టమూ మాట్లాడలేదు.

విశ్వనాథం చూపు గ్రంథంమీద లగ్నం అయింది.

"రామదాసు" అన్న అక్షరాలు చుట్టం కళ్లకి కట్టాయి.

"మనం చూడ్డానికి వచ్చిన నాటకం, చదువుకుని ఆనందిస్తున్నాడు అన్నయ్యా. డబ్బుకీ ప్రాణానికీ లంకె మరి" అనుకున్నాడతను, తన సాహసౌదార్యాలు స్మరించుకుంటూ.

అతని రసికహృదయం ఝల్లున వికసించింది.

వెంటనే పేరుపడ్డ నటకుల ననుకరిస్తూ పాట మొదలు పెట్టా డతను.

"ఏమాత్రం రా శేరం ?" అనడిగాడు విశ్వనాథం, ఫ్రస్ట్రేట్ మూసేసి

"ఏం శేరం ?"

"బాగుంది—ఎంతకి వొప్పుకుని వచ్చావురా ?"

వేనికోయ్ ?"

"నాటకంలో వేషం వెయ్యడానికి, దాస్తా వేమిటోయ్ ?

"నీధోరణి నా కర్థం కావడం లేదు"

"నీధోరణి నా కర్థం అవుతోంది సరి ?"

"ఏమనీ ?"

"నీభాగం చింతః చేసుకుంటున్నా వని"

"......అదా నాయనా, ఇంతాకణ్ణుంచీ ఆచిత్రరుబున్ను— నీ చదువుకి అడ్డువచ్చా ననా ?"

విశ్వనాథం మాట్లాడలేదు.

అయినా, చుట్టాసికి మాత్రం బరువు దిగిపోయిన ట్టయింది.

మనస్సు తేరుకుంది.

"చిరాకు పుట్టనంతసేపూ చాలా మంచివా డన్నయ్య" అనుకుని సంబరపడుతూ నోరు బిగపట్టు కూర్చున్నా డతను.

3

కళ్లు మూసుకుని వుండి తల మొగరవేసుకుంటూ కూనిరాగాలు తీస్తూ పరవశు డవుతూ వుండిన్నీ యాదాలాభంగా వీధికేసి

చూసి "వేషం మార్చేసి వదిన వీధిలోనుంచి వస్తోం దేమిటీ ?" అనుకున్నాడు, చుట్టం, విస్మృతాస్యుడై.

"చెల్లి యింకా వంటింటోనే వుందా యేమిటి మరిదిగారూ?" అనడిగింది, వస్తూనే, ఆజంగమప్రతిమ.

"దయచెయ్యండి" అన్నాడు విశ్వనాథం, ముందు పుస్తకం మూసేసి. "వంటింటికి తాళం వేసి ముప్పావుగంట అయింది; కాని మళ్లీ తియ్యవలసివచ్చింది" అన్నాడు తరవాత.

"ఏమిటా ?" అనడిగింది రుక్మిణి, ఒక్కమాటు చుట్టంకేసి చూసి.

"చుట్టం వచ్చాడు"

"ఎవరు, ఏమవుతారు ?"

"అడిగో, వాడు—మా పింతల్లి కొడుకు."

"ఎందుకు వచ్చారూ యిప్పుడూ ?"

చక్కదనం చూసి మొదట ఆదరంగానే చూశాడు; కాని యీప్రశ్నలతో వ్యగ్రుడై, రుక్మిణిని, గుర్రుగా చూశాడు చుట్టం.

"నాటకం చూడ్డానికి కీవూరూ, భోజనానికి మాయింటికీ వచ్చాడండీ" అన్నాడు విశ్వనాథం.

"చుట్టపుచూపులకు కాదూ ?" అంటూ నాగతీసుకుంది రుక్మిణి.

విశ్వనాథం చిరునవ్వు నవ్వి వూరుకున్నాడు.

చుట్టానికి చీమలూ జెర్రెలూ పాకుతున్నట్టనిపించింది.

"అయితే, చెల్లాయి మళ్లీ వంట చేస్తోం దన్నమాట ఆస్టవ్వు గోల అందుకా ?"

"కంపటిమీద వండితే మావాడి కాలస్యం—"

"మరి యింత రాత్రయాక వచ్చారేం ?"

"పెందలాడే రావడానికి, హాయిదగ్గిర కూచోవాలా పైప నులు చేసుకోవాలా ?"

చుట్టం చూపులు నిశ్చలా లయిపోయాయి.

"ఇది రుక్మిణితో ఛలోక్తిగా అన్నమాటా, మన యెడల నిరసనగా అన్నమాటా ?" అంటూ చర్చలో పడ్డాడతను.

"తాను స్కూలుఫైనలే. నేను బి ఏ. ఆనర్సుని. నన్ను నిర సించి బతగ్గలడా వీడు ?" అని తేల్చుకున్నాడు చివరికి.

చుట్టం యీస్థితికి వచ్చేటప్పటికి రుక్మిణి మరో అడుగు ముందుకి వేసింది.

"తొమ్మిది కాదూ మరిదిగారూ ?" అనడిగిందామె, నిశ్చ లంగానే చూస్తూ.

గదిలో వున్న గడియారంకేసి చూసి "తొమ్మిదీ రెండు" అన్నాడు విశ్వనాథం.

"బాబోయ్" అనుకున్నాడు చుట్టం.

పడకకుర్చీలో పడుకుని వున్నవాడల్లా నిటార్గా కూచు న్నాడు, కంగారుగా.

"మరిదీ, యెసరు కాగింది, యిక బియ్యం పొయ్యాలం—" అంటూ గుమ్మంలోకి వచ్చింది కామేశ్వరి.

"సేనాధిపతికి యుద్ధవార్తల్లాగ, వంట యేకాడికి వచ్చిందో యేక్షణాని క్షణం మీ మరిదిగారికి నివేదించుకోవాలా యేమిటి చెల్లీ ?" అనడిగింది రుక్మిణి

"ఇదిగో, అక్కయ్యగారేరే ? ఇంటోకి రండి"

"కభుర్లు మొదలుపెడితే వంట పురిచిపోతాను నువ్వు, వదినగారి నిక్కడే వుండనియ్యి"

"బియ్యం నేను కడిగిపెట్టనా చెల్లీ ?"

"ఇంకేం ? మీ చెల్లెలిమీద అంత అభిమానమైతే, సీట పరచడాని కొకర్నీ, మంచినీళ్ళుంచడాని కొకర్నీ, మడిబట్ట అందించడాని కింకొకర్నీ, వడ్డించడానికి మరొకర్నీ కూడా సాయం తేసుకురండి వదినగారూ"

"ఎందరు కష్టపడకపోతే, మీ అన్నదమ్ములకు కూచున్నచోటికి కుంభం వస్తుంది మరిదిగారూ ?"

"ఆకష్టపడ్డంలో, ముందు రుచిచూడ్డం కూడా వొకటేనా?"

"అది మీ అక్కాచెల్లెళ్ల పద్ధతి కామోసు, మామీద రుద్దుతున్నారు"

గతుక్కుమనిపోయాడు చుట్టం.

అది గుర్తించి తల పంకించుకుంది రుక్మిణి.

"మరిదీ, యిక పది నిమిషాల్లో భోజనం అయిపోతుంది" అని చుట్టానికి చెప్పి "టయిమెంతయిందండీ ?" అనడిగింది కామేశ్వరి, భర్తని.

"తొమ్మిదీ పదమూడు" అన్నాడు విశ్వనాథం.

"మీ వాచీ నాలుగు నిమిషాలు స్లో" అంది రుక్మిణి, తన రిస్టువాచీ చూసుకుంటూ.

చుట్టమున్నూ తన రిస్టువాచీ చూచుకున్నాడు.

అతని మొగాన ఆత్రం కమ్ముకుంది.

"ఎంతయింది మరిదీ ?"

"తొమ్మిదీ పదిహేను"

"బాబోయ్ !" అంటూ కంగారుపడి, వొక్క అడుగు లోపలికి వేసి, వెనక్కివచ్చి మళ్లీ గుమ్మంలో నుంచుంది కామేశ్వరి, భర్తకేసి చూస్తూ.

చూసిచూసి "అధరు వేమయినా వుందా, చెయ్యాలా చెల్లీ ?" అనడిగింది రుక్మిణి.

"లేదండీ, వొట్టి కందిపొడితో యెలా అన్నం పెట్టనూ పాపం, మా మరిదికీ ? బంగాళాదుంపలు వేయిస్తాను"

"అన్నం వుడికితే అదెంతసేపు లే"

"అయితేనూ, నువ్వు కబుర్లు చెబుతూ నుంచోడమేనా, బియ్యం కడిగి యెసట్లో పొయ్యడం వుందా ? అవతల మా వాడి కింకా యేమేం పనులున్నాయో మరి ?" అంటూ కస్సుమన్నాడు విశ్వనాథం.

అత నిలా అన్నా డంటే, ఆవిసురు ఇంకా పూర్తి కాలేదు; గాని గభీ మని లేచి నుంచున్నాడు చుట్టం.

"తెలిసింది లే అన్నయ్యా, నీ ధోరణి యిప్పటికి బాగా బోధపడిపోయింది. ఒక్క పూట భోజనం భాగ్యానికి నువ్వింత మొగం చూచుకుంటా వనుకోలేదు నే నెప్పుడూను. అన్ని గడుసు రాతలు చూపించకపోతే స్పష్టంగానే చెప్పెయ్యరాదూ, అన్నం పెట్టలే నని. తీరా, వూళ్లోకి వచ్చి గుమ్మంలోకి రాక పోతే అతిశయం అనుకుంటా రని గాని, రానూ పోనూ రూపాయి పావులా రెయిలుకీ, రెండు రూపాయిలు నాటకానికీ,

మరో అర్థరూపాయి సాదర్లకి ఖర్చుపెట్టగలవాణ్ణి, మూడువాప్పు లాల డబ్బులు హోటలువాళ్ల మొగాన పారెయ్యలే నను కున్నావా? వెతుక్కుంటూ వచ్చినందుకు—వాళ్లే నేర్చుకు పోయావ్! నువ్వింత పరమలోభి వని నే నెప్పుడూ అనుకో లేదు. ఇక నీగుమ్మంలో అడుగుపెడితే అడుగు ఆడవాళ్లతో సరిగా ఆడేశావ్ భాగోతం?" అంటూ కంగారుగా చెప్పులు తొడుక్కుని విసురుగా బయలుదేరేశాడు.

"ఏమన్నారూ? నుంచోండి" అంటూ గదినుంచి రుక్మిణి.

ఆమె కళ్లల్లో నిప్పులు రాలుతున్నాయి.

అది చూసి చకిత అయింది కామేశ్వరి.

చట్టం మాత్రం వీరిలో అడుగు పెట్టి మరీ తిరిగిచూశాడు.

౪

"శుద్ధపశువు. చదువూ సంధ్యా లేక—"

"చదువు లేకపోవడం యేమిటి నదినగారూ? రెండేళ్లు తప్పి చివరికి బి.ఏ. అయిపోయారండీ"

"అయితే, యిప్పటికి వచ్చిందా బి.ఏ. కి బుద్ధి?"

"బుద్ధి వచ్చినవాడలాగే మాట్లాడతాడుటండీ?"

"కాకపోయినా, మీరు తెగేదాకా లాగుతా రండీ" అంది కామేశ్వరి, యివతలికి వచ్చి.

"ఆమాట మీ అక్కయ్యగారి ననమను"

"అయితే, మధ్యాహ్నానికి మధ్యాహ్నమూ, యిప్పటి కిప్పుడూ కూడా యీ చుట్టాల వుప్పైన యేమిటి చెల్లాయీ మరీ?" అనడిగింది రుక్మిణి.

కామేశ్వరి మాట్లాడలేకపోయింది.

"ఊరుకుంటావేం ?" అని ముదలకించాడు విశ్వనాథం.

"వెర్రిపిల్ల, వూరుకోక చెల్లెమ్మ యేమి జవాబు చెబుతుంది లెండి పాపం ! వాళ్ళకి తెలవాలి; గాని తీరా యింటికి వచ్చాక వండడం తప్పుతుందా, పెట్టడం మానుతుందా ?"

"అయితే, ప్రతీపూటా రెండో వంట చెయ్యవలసిందేనా?"

"ఇక నూరూరా చాటేస్తాను అమ్మ లక్క లందరూ నన్నాడిపోసుకుంటారు"

"ఇదివరకే ఆడిపోసుకోడం లేదంటావా ? రావడం మానేస్తే యేమి చేసినా సరే, యేమంటారు వదినగారూ ?"

"చాటేస్తా డంటే తక్కినవాళ్ళకీన్నీ బుద్ధివస్తుంది, మంచిదే కాదూ ?" అనడిగింది రుక్మిణి.

"మనస్సులో తిట్టుకుంటూ చేరనివ్వడం కంటే గ్రహించలేనివాళ్ళ కిలాగే చెయ్యాలి. వీడివాళ్ళందరూ నన్ను లోభి అంటారు, అంతేనా ?"

"ఎనిమిది న్నరకే వచ్చి—"

"అయ్యో, అస లయిదు గంటల బండిలోనే వచ్చాట్టండీ, కాని గోదావరి గట్టు పొడూగునా షికారుకొట్టాడుట, విన్నారా అక్కయ్యగారూ ?"

"హోటలు లున్న వూళ్ళో, మరో పనిమీద వచ్చి కూడా చుట్టాల యింటిమీద పడడం నిలిచిపోవాలంటే—"

"అదలా వుండగా, వీరందరూ, మీ మరిదిగారికీ, అంత కంటే నాకూ ఆచారం తక్కువ అనీ, ఆ గుడ్డంతో తింటామనీ మాటిమాటికీ దెప్పుతూనే వుంటా రక్కయ్యగారూ"

"మరి బుద్ధి వుండేనా తిండికి చేరడం ?"

"వాళ్లతో పని వుంటే గాని నేను చుట్టాల యింటికి వెళ్లను వదినగారూ ! కాకినాడ వెళితే, మా చెల్లెలా వూళ్లోనే వున్నా, హోటల్లో భోజనం చేసి, తరవాత దాన్ని చూసి వస్తాను. నిజంగా, నే నీ కందారాజుగారి యింటికి వెళ్లి పదేళ్లు దాటిం దండీ"

"పదిహేను దినాలు కాలేదు వీళ్ల నాయన వచ్చి. పొద్దుటి పూట తొమ్మిదింటికే వడ్డించమని, రాత్రి పది కొట్టాక వచ్చి, మూన్నాళ్లు నా యెముకలు కొరికేశా రక్కయ్యగారూ ! నిన్న ఆరవేసిన బట్ట పనికిరాక, తడిబట్టతో వంటచెయ్యడం అలవాటు లేక ——"

"శ్రోత్రియు డనీ, దేవతార్చనపరు డనీ, నే నాయ న్నెప్పుడూ గౌరవంగానే చూస్తా నండీ, యేమి బాధపెట్టి నానూ ? కాని వీడి మాట చెప్పండీ"

"నిూ రామాట అంటే జ్ఞాపకం వచ్చింది, వొకమా టేం జరిగిం దనుకున్నారు మరిదిగారూ ? ఆవేళా ? బొబ్బట్లు చేసు కున్నామూ ? జ్ఞాపకం వుందా చెల్లీ ? రాకరాకవచ్చాడు . మా తమ్ముడు. నిూ బావగారు తాపితా కట్టుకున్నారు. నేను వడ్డిం చేశాను, "నేను మడికట్టుకోను, నీబంతికి రానిస్తావా లేదా బావా ?" అనడుగుతున్నాడు మావాడు. అలాంటప్పుడు యములాళ్ల లాగ ఆరుగురు చుట్టాలు వచ్చిపడ్డాడు"

"అయ్యో"

"అయ్యో అంటే, యెద్దుపుండు కాకికి నొప్పా? పోనీ, అంటే అందరూ మొగాళ్లు. ఆబట్టలతో తినే రకం. కోర్టులో సాక్ష్యం యివ్వడానికి వచ్చారుట కూడానూ"

"ఇదిగో, యీ రకమే" అన్నాడు విశ్వనాథం, వీధికేసి చూపిస్తూ.

"నా ప్రాణా లెగించిపోయాయి. పిండివంట వెక్కిపెట్టేద్దామంటే మరి మజ్జిగ? అన్నం యెలాగా తప్పదు, కూరా చారూ చెయ్యాలా?"

"బాబోయ్!"

"ఏం, బాబో యనేదానవు, అంతా అయిపోయాక నువ్విప్పుడు మళ్లీ మొదటికి వచ్చావా లేదా?"

"ఎసరు పెట్టావా లేదా చెల్లీ?"

"అప్పుడు మీ రేమి చేశారో అది చెబుదురూ అక్కయ్యగారూ!"

"నాకు మహా చెడ్డ కోపం వచ్చేసింది. నేనిక వండలేను అని మొండికెత్తి కూర్చున్నాను"

"బావగారు?"

"వారు నాకంటే యెక్కువ మండిపోయారు. 'మీకు బుద్ధి వుందా లేదా?' అనడిగేసే టంత మండిపడ్డారు వారు. నా ప్రాణాలు మళ్లీ యెగించిపోయాయి. కాని యింతా చూసి 'నే నో గమ్మత్తు చేస్తాను మీరు గప్‌చిప్' అన్నాడు మా తమ్ముడు. నేనే కంగారుపడ్డాను గాని 'కానియ్యి' అనేశారు మీ బావగారు"

"నాకు నచ్చినవారు కారూ అన్నయ్యగారూ ?"

"అక్కడికి, అక్కయ్యగారు నాకు నచ్చినవారు కామోసు, పా—పం"

"మరి వెంట కెందుకు సిద్ధపడ్డావ్పూ ?"

"......మీరు చెప్పం డక్కయ్యగారూ "

"అప్పుడు, మా తమ్ముడు, తువ్వాలు బుజాన వేసుకుని వాళ్ల దగ్గిరికి వెళ్లి "నేను హోటల్లో భోజనం చేసి వస్తా" నన్నాడు. "అదేమి" టన్నారు వాళ్లు, ముందు తెల్లపోయి. "చాకిరీ చేసుకోలేక మా అక్కా బావా హోటలునుంచి తెప్పించుకు తింటున్నా" రన్నాడు మావాడు. దాంతో, వాళ్లు మొగమొగాలు చూసుకున్నారు. పెదవులు విరుచుకున్నారు. కనుబొమ్మ లెగరవేసుకున్నారు. వెకిలినవ్వులు నవ్వుకున్నారు. మొగాలు వేలవేసుకున్నారు. చివరికి పట్టుపంచెలు బుజాన వేసుకుని "శుచిగా వెళ్లే హోటలు చూపించ" మంటూ వాడి వెంట పడ్డారు"

"మొదట్లే ఆపని చేస్తేనో ?"

"అలా చేస్తే యిప్పటికీ నాకు జ్ఞాపకం కెందుకు వస్తుంది, న వ్వెందుకు వస్తుంది ?"

"అప్పుడు అన్నయ్యగా రేంచేశారో అది చెప్పం డక్కయ్యగారూ"

"నేను టేబిలుభోజనం చేస్తాను గాని చాద స్తపు హోటల్లో తినను. నాళంవారి సత్రం దాటి వెడితే, మళుపులో వొక ముసలమ్మ తడిబట్ట కట్టుకువడ్డిస్తుంది, వెళ్లండి, యెవళ్ల నడిగినా

చెబుతారు" అని వాళ్లని విడిపించుకుని రెండు వీధులు తిరిగి యింటికి వచ్చేశాడు. తరవాత, మేము ముగ్గురమూ యేకబం తిని భోజనం చేశాము. అయితే, కడుపు చెక్క లయిపోయేట్టు నవ్వుకోడమే గాని యేమీ తినలేకపోయాం"

"చేసిన బొబ్బట్లన్నీ మిగిలిపోయాయి కామోసు పాపం"

"మీ యిద్దరికోసమూ పట్టుకు రాగా మీ రప్పటికే ఆఫీసుకు వెళ్లిపోతి రామె మరి"

"మీ చెల్లాయికి___"

"వొంటెత్తు గుణ మన్నా సరే, మరేమన్నా సరే మీరు, మా చెల్లాయికి పెట్టకుండా నే నేమీ తినలేను సుమండీ"

"మీరు నన్ను వూరిద్దా మనుకుంటున్న ట్టుంది, లాభం లే దూరుకోండి"

"అంటే ?"

"ఆవేళ సాయంత్రం, మా అన్నగారు నన్ను కాఫీహోటలుకి తీసుకువెళ్ల లేదనా ?"

"చూశావుటమ్మా చెల్లీ ? మన కేమయినా—ఇద్దరిలో వొక రయినా చెప్పారా ?"

"చాటున యేమి చేసుకుంటే లెక్కల్లోకి వస్తుం దక్కయ్య గారూ ?"

"మరే, · మరే, నిజమే. అయితే, చివరి కేమయిందో తెలుసా ? ఈసంగతి నాలుగు రోజులకే చుట్టాల కందరికీ తెలిసి పోయింది. అది మొదలు, మాతో పని లేనివాళ్లు మాయింటికి భోజనానికి రావడం మానుకున్నారు"

"బతికారు"

"దీంతో, మనకీ అలాగే అవుతుం దండోయ్"

"శావా లనే కాదూ నా కోరిక ?"

"......మరి, మీా తమ్ముడు వేంచేశాక కూడా మన కాలక్షేపం యేమిటి మరిది గారూ ?"

"అవు నవు" నంటూ లేచి, కంగారుగా లోపలికి వెళ్లి, చొక్కా తొడుక్కుని కండువా వేసుకుచక్కా వచ్చాడు విశ్వనాథం "అన్నగారు సిద్ధంగా వున్నట్టేనా ?" అనడుగుతూ.

"నే నిక్కడే వున్నా నండోయ్" అంటూ వొక మాట దూసుకువచ్చింది లోపలికి

"మీా అన్నగారు మాటలోనే వచ్చా రండీ" అని విశ్వనాథానికి బదులుచెప్పి "మనవాళ్ల యింటో కూడా ఆవేళ మన యింటో లాగే జరిగిందండోయ్" అంటూ భర్త కెదురు వెళ్లింది రుక్మిణి.

"ఏమిటి తమ్ముడుగారూ ?" అంటూ ఆయన యింటోకే వచ్చాడు.

"చుట్టాల గోల అన్నగారూ! వీళ్లకి మంచీచెడ్డా యేమీా లేదు. పట్నానికి కేపనిమీాద వచ్చినా, మహా, ప్రేమ వొలికి పోతున్నట్టు భోజనానికి తయారు. ఒక డుదయం తొమ్మిదింటికే కావా లంటాడు. ఒకడు వొంటిగంట దాకా మాడ్చేస్తాడు——"

"ఒకడు పెరుగు వడ్డించవమ్మా వదినా అంటూ గునుస్తాడు, అవునా, రుక్మా ?"

"పోనిస్తురూ, ఏదో నోచు జారాడు పాపం"

"అదేమిటో చెప్పరూ అక్కయ్యగారూ ?"

"ఏమీ లేదమ్మా ! మీ బావగారి చిన్నమ్మమ్మ సవతి మనమడుట, వొంటిగంటకి దిగా డొకనాడు. పప్పూ కూరా అయిపోగా, వూరుగాయా, పచ్చడీ, పులుసూ వడ్డించాను, దాసీదానికి పడెయ్యడం మానేసి. అంతా తిని 'మజ్జిగ వద్దు పెరుగు వడ్డించవమ్మా వదినా' అంటూ గునిశాడు వెర్రి నాయన !"

"మావ్మా, మాతండ్రే"

"వయస్సెంతని అడగనేం చెల్లీ ?"

"పిల్లల తండ్రి అయివుంటాడు, అవునా వదినగారూ ?" అనడిగాడు విశ్వనాథం.

"బి.ఏ కదా, మీకు సందేహం యెందుకూ తమ్ముడు గారూ ?" అనడిగాడు రుక్మిణిభర్త.

"అప్పుడేమి జరిగిందనకన్నావు చెల్లీ ?.....అది కూడా మీరే చెప్పండీ"

"ఆవేళ యేదో సెలవురోజు తమ్ముడుగారూ ! భోజనం చేసి, వాకట్లో కూచుని, పేరుకుపోయిన ఉత్తరాలకు జవాబులు రాసుకుంటున్నాను నేను. అసలు, వాడు గుమ్మంలో అడుగు పెట్టా టప్పటికే నాకు చిరాకు పుట్టుకువచ్చింది. ఆమాటతో నాకు అరికాలి మంట నెత్తికెక్కిపోయింది. ఉత్తరాలు విడిచిపెట్టి అమాంతంగా లేచి వెళ్ళి,. ఆవెళ్ళడంలో కొంచెం శాంతి వహించి 'నువ్వు పెరుగుకోసం గునుస్తున్నావు గానీ, యివాళ మేము వాడుకుంటున్న మజ్జిగ మొన్నటిది, తెలుసా ?' అనడిగాను.

వాడు తెల్లపోయాడు. ఏమనుకున్నాడో, పులుసుతోనే భోజనం పూర్తిచేసి లేచిపోయాడు"

చూసిచూసి "అయితేనూ ? మన మిలా మాటలు చెప్పు కుంటూ వుంటే—" అంటూ మాట నాన్చేసింది కామేశ్వరి.

"అవునవును, ఈ మొగాళ్లతో యిదే వరస. కబుర్లకందు కుంటే యిక అంతంటూ వుండదు. నువ్వు బయలుదేరు చెల్లీ!"

"హోహో ! నిజమే అయితే, ఆడవాళ్లు భోజనం చేసి వెళ్లాక విస్తర్లదగ్గిర కాళ్లు చాచుక్కూచుని మరీ మొదలు పెడతారు కాదూ రుక్కూ, మొగాళ్లు కబుర్లూ ?"

"మహాబాగా అడిగా రన్నయ్యగారూ !"

దీనికి బదులుచెప్పక కామేశ్వరీ రుక్మిణీ వీధిలోకి వెళ్లి నుంచుని "మరి కదలరేం ?" అని గట్టిగా అడిగారు.

౩

కబుర్లు చెప్పుకుంటూ నలుగురూ బయలుదేరారు.

కొంచెం దూరం వెళ్లాక, కాళ్లకి కుచ్చెళ్ల కొంగు అడ్డం వచ్చినట్లు నటించి, కొంచెం ఆగి, కామేశ్వరి, పక్కవాటుగా మొగుడికి తాంబూలం అందించి, మళ్లీ రుక్మిణితో కలుసుకుంది.

కుర్చీలు రిజర్వు చేయించుకున్నారు కనక, నాటకశాల అడుగుపెట్టడానికి వీలులేనంతగా నిండిపోయి వుండినా వారి కిబ్బంది లేకపోయింది.

బండరాళ్లు తప్పించుకుంటూ, వంకరటింకర్లుగా సెలయేరు ముందుకి సాగిపోయేటట్టు, వారు, మొగుడూ పెళ్లాం, మొగుడూ

పెళ్లాంగా నిండు కుర్చీ ్ంచుకువెళ్లి, మొగుడూ పెళ్లాం, పెళ్లాం మొగుడూగా మొదటివరసలో మధ్యగా కూచున్నారు, దర్జాగా.

వారు కూచున్నారు.

అంతే.

నాటకం ప్రారంభం అయిపోయింది.

భోజనానికి లాగే నిక్కినీలిగివెళ్లి, కుర్చీ టిక్కట్టు కొను క్కునీ కూడా స్థలం లేక, రైటువింగు పక్కని గోనెపట్టా పరి పించుకుని వుసూరు మంటూ కూచుని—హఠాత్తుగా విశ్వ నాథం జట్టు చూసి నోరు తెరిచేశాడు చుట్టం.

౧౯౩౫ జనవరి భారతినుంచి
సవరణలతో